
సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం, 2, అక్టోబర్, 2023



మహాత్ముని మాట.. స్ఫూర్తి బావుటా

జాతిపిత మహాత్మాగాంధీ రగిలించిన స్ఫూర్తితో స్వాతంత్య్ర సంగ్రామంలో మదనపల్లె వాసులు పాల్గొన్నారు. -8లో..



వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

ఎర్రగుంట్లలోని నడివూరులో వినాయక నిమజ్జనం సందర్భంగా అపశ్రుతి చోటు చేసుకుంది. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 312 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	502
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 398.760 కిలోలు

న్యూస్‌రీల్

వృద్ధ ఓటర్లను స్ఫూర్తిగా తీసుకోవాలి



సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న డీఆర్‌ఓ సత్యనారాయణ

రాయచోటి: ప్రజాస్వామ్య పరిరక్షణలో 80 ఏళ్ల నిండిన ఓటర్ల పాత్ర ఆదర్శప్రాయమని అన్నమయ్య జిల్లా డీఆర్‌ఓ సత్యనారాయణ అన్నారు. వారిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లాలో 80 ఏళ్లు నిండిన ఓటర్లకు స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి ఎంతో కృషి చేసిన వారిని గౌరవించుకోవడం మన బాధ్యత అని అన్నారు. రాయచోటిలోని బేతల్‌కాలనీలో నివసిస్తున్న 80 ఏళ్ల హరినాథగుప్తా, మాసాపేటకు చెందిన 82 ఏళ్ల కమాల్‌సాహెబ్, 84 ఏళ్ల ఖాదర్, ఎస్ఎన్ కాలనీకి చెందిన 80 ఏళ్ల సుబ్బారెడ్డిలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని ఎలక్షన్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం



అండర్-19 నెట్‌బాల్ బాల,బాలికల జిల్లా జట్లు

మదనపల్లె సిటీ: క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చిత్తూరు, అన్నమయ్య జిల్లాల స్కూల్ గేమ్స్ కార్యదర్శులు జయరామయ్య, వసంత అన్నారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-19 బాల,బాలికల జిల్లా స్థాయి ఫుట్‌బాల్, బీటీ కాలేజీ మైదానంలో అండర్-19 బాల,బాలికల బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ జట్ల ఎంపికలు జరిగాయి. ఎంపికకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జయరామయ్య మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జట్ల ఎంపికలు జరిగినట్లు తెలిపారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-19 ఫుట్‌బాల్ బాల,బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రెడ్డన్నశెట్టి, రాజగోపాల్, నారాయణ, ఆంజనేయులు, హెచ్ఎం సుబ్బారెడ్డి, ఆర్గనైజర్లు నాగరాజ, సుధాకర్, పీడీలు నరేష్‌బాబు, అజీమ్, అన్సర్, నటరాజ, మహమూద్, మురళి, దిలీప్, కమలేష్, వెంకటరమణారెడ్డిలు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటలు ముఖ్యమే



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా క్రీడా శాఖ అధికారి చంద్రశేఖర్

రాయచోటి టౌన్: చదువుతోపాటు ఆటలు ముఖ్యమేనని అన్నమయ్య జిల్లా క్రీడా శాఖ అధికారి చంద్రశేఖర్ అన్నారు. శాప్ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఎంపికలు నిర్వహించారు. ఈ సెలెక్షన్‌లో భాగంగా వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, హాకీ, బ్యాడ్మింటన్ వంటి క్రీడా పోటీలు నిర్వహించారు. అలాగే బాల్‌త్రో, 800 మీటర్ల పరుగు పందెం వర్టికల్ జంప్, 30 మీటర్ల ఫ్లైయింట్ స్టార్ట్, షటిల్ రన్ వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ శిబిరంలో సెలెక్షన్ అయిన వారు రాష్ట్ర స్థాయి అకాడమీలో పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలెక్షన్ సభ్యులు నరసరాజు, షామీర్ బాషా, బాలశేఖర్, గౌస్ బాషా, లక్ష్మీనారాయణ, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం..సాకారం

- సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో సమూల మార్పులు
- కళ్ల ముందే కనిపిస్తున్న గాంధీజీ కలలుగన్న సుపరిపాలన
- ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కారం
- నేటితో సచివాలయాల వ్యవస్థకు నాలుగేళ్లు పూర్తి





సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయం

సాక్షి, రాయచోటి: జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కళ్లముందే ఆవిష్కృతమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. గాంధీజీ ఆశయాలను నెరవేరుస్తూ ప్రజలకు వైఎస్ జగన్ సర్కార్ సుపరిపాలనను అందిస్తోంది. ఎక్కడికక్కడ వలంటీర్ల వ్యవస్థతోపాటు సచివాలయాల ఏర్పాటుతో సమాజంలో జీవన స్థితిగతుల రూపురేఖలే మారిపోయాయి. సమస్య ఏదైనా.. పరిష్కారం కూడా అక్కడికక్కడే లభిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాల ద్వారా సుపరిపాలన

అన్నమయ్య జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలు సుమారు 501 ఉన్నాయి. వాటి పరిధిలో వలంటీర్లు మొదలుకొని సిబ్బందిని నియమించారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున నియమించడంతో.. ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే ప్రభుత్వ సేవలు అందిస్తున్నాయి. 'జగనన్నకు చెబుదాం.. జగనన్న ఆరోగ్య సురక్ష' లాంటి వినూత్న కార్యక్రమాలతో ప్రజల ముంగిట నిలిచారు. ఏది ఏమైనా అనుక్షణం ప్రజలతోనే అధికార యంత్రాంగం ఉంటూ ఎక్కడికక్కడ సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో కొత్త కాంతులు


మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం.. ప్రస్తుతం సుపరిపాలన ద్వారా కనిపిస్తోంది. జిల్లాలో సచివాలయాల నిర్మాణంతోపాటు ఆర్బీకేలు, బల్క్‌మిల్క్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు, విలేజ్ క్లినిక్‌లు, నాడు-నేడుతో రూపుమారిన పాఠశాలలు, ఆస్పత్రుల భవన నిర్మాణాలు ఇలా నూతన భవనాలతో ఎక్కడ చూసినా అభివృద్ధి కనిపిస్తోంది. ఒకపక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధితో కొత్త కాంతులు వెదజల్లుతున్నాయి. ఇవేకాకుండా రోడ్లు, ఇతర భవనాలు, పరిశ్రమలు ఇలా అన్ని రంగాలు నూతన కాంతులీనుతున్నాయి. ఎక్కడ చూసినా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతుండడం సుపరిపాలనలో భాగమేనని మేధావులు వర్ణిస్తున్నారు.

సచివాలయ వ్యవస్థకు నాలుగేళ్లు

రాష్ట్రంలో 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థతోపాటు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. 2019 అక్టోబరు 2వ తేదీ నుంచి సచివాలయ వ్యవస్థ అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి సచివాలయ వ్యవస్థ ద్వారానే సిబ్బందిని నియమించి ఎక్కడికక్కడ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతూ వస్తున్నారు. సచివాలయ వ్యవస్థకు గాంధీ జయంతి రోజున సోమవారంతో నాలుగు వసంతాలు పూర్తి కానున్నాయి.

జిల్లాలో వార్డు సచివాలయాలు: 414	
గ్రామ సచివాలయాలు: 87	
మొత్తం : 501	
సిబ్బంది: 5230	వలంటీర్లు : 8658







పీలేరు గ్రామ సచివాలయంలో ప్రజలకు సేవలందిస్తున్న సిబ్బంది

చరిత్రాత్మకం



సచివాలయ వ్యవస్థ చరిత్రాత్మకం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ వ్యవస్థ ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుంది. ప్రతి పని సచివాలయ వ్యవస్థ ద్వారానే జరుగుతోంది. సచివాలయాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. – పీఎస్ గిరీషా, కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

మాంసం దుకాణాలు మూసివేయాలి

రాయచోటి అర్బన్: గాంధీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో సోమవారం అన్ని రకాల మాంసాహారం, చేపల విక్రయ దుకాణాలు, హోటళ్లు మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఆదేశాలను ఖాతరు చేసిన వారికి వెయ్యి నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు చేపల మార్కెట్, మాంసం దుకాణాలు, హోటళ్ల యజమానులకు మున్సిపల్, సచివాలయం అధికారులు, సిబ్బంది నోటీసులు అందజేశారు.

ఆనందమని'పింఛన్'

- తొలిరోజే 80.66 శాతం పంపిణీ



రాయచోటిలో వృద్ధుడికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్

రాయచోటి: జిల్లాలో ఆదివారం వేకువజాము నుంచే ప్రారంభమైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. మొదటి రోజునే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా 80.66 శాతం మందికి పింఛన్లు అందజేసి పెన్షనర్ల మెప్పు పొందారు. వలంటీర్లు పెన్షన్లను ఇంటింటికీ వెళ్లి అందించారు. జిల్లాలో 2,25,769 మంది పింఛన్‌దారులకు రూ.62.28 కోట్లు మంజూరు అయ్యింది. ఇందులో మొదటిరోజు రాత్రి 7.30 గంటల వరకు 1,82,172 మందికి గాను రూ.50.23 కోట్లు పంపిణీ చేసినట్లు వెలుగు పీడీ సత్యనారాయణ, ఏపీడీ ధర్మరాజు తెలిపారు. మిగిలిన వారికి కూడా మరో రెండు రోజుల్లో పూర్తిగా పంపిణీ చేస్తామని వారు పేర్కొన్నారు. జిల్లాలో జరుగుతున్న పెన్షన్ల పంపిణీ విధానాన్ని డీఆర్‌డీఏ పెన్షన్ డీపీఎం ధర్మరాజు పరిశీలించారు. వేలిముద్రలు పడని వారికి కంటి చూపు ద్వారా గుర్తింపు చేసి అందజేశారు.

ఒక్కటైన ఆ ముగ్గురు..!

- టీడీపీ నేతల మధ్య తెరపైకి ఆధిపత్య పోరు
- నాన్‌లోకల్ అభ్యర్థులకు సహకరించేది లేదు
- తేల్చి చెబుతున్న కడప నియోజకవర్గ నేతలు



దేవునికడపలో ఆలయానికి వచ్చిన కార్పొరేటర్ ఉమాదేవి, ఇతర మహిళా నేతలు

సాక్షి ప్రతినిధి, కడప: 'ఎంత కాలమైనా పల్లకీ మోసే బోయీలుగానే మిగిలిపోవాలా.. నాయకత్వ పగ్గాలు పుచ్చుకునే అర్హత మాలో ఎవరికీ లేదా.. నాన్ లోకల్ అభ్యర్థిని మాపై రుద్దుతారా' అని కడప టీడీపీ నేతలు మండిపడుతున్నారు. పార్టీ విజయం కోసం కలిసికట్టుగా పని చేస్తామని, మాలో ఒకరికి టికెట్ కేటాయించాలని కోరుతూనే, నాన్‌లోకల్ అభ్యర్థికి సహకరించబోమని తెగేసి చెబుతున్నారు. వెరసి తెలుగుతమ్ముళ్ల మధ్య ఉన్న కోల్డ్‌వార్ తెరపైకి వచ్చింది. ఇన్‌చార్జితో ప్రమేయం లేకుండా ఆ ముగ్గురు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. తాజాగా చంద్రబాబు విడుదల కావాలని దేవునికడప శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టారు. టీడీపీ నేత అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి తన కోడలు, కార్పొరేటర్ ఉమాదేవికి నియోజకవర్గ ఇన్‌చార్జి అభ్యర్థిత్వం కోసం పోటీ పడ్డారు. ఆ స్థానంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి సతీమణి మాధవీరెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు. అప్పటికే పలుమార్లు అధినేత చంద్రబాబుతో ప్రత్యేకంగా సమావేశమై స్థానికులకు అవకాశం కల్పించాలని కడప నేతలు కోరారు. గతంలో టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసిన దుర్గాప్రసాద్, అమీర్‌బాబుకు అవకాశం కల్పించాలని, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తే కార్పొరేటర్ ఉమాదేవికి ఇన్‌చార్జి పదవి ఇవ్వాలని విన్నవించారు. మాలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసికట్టుగా పని చేస్తామని తెలిపారు. వీరి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోకుండా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డికి కడప పట్టం కట్టడాన్ని.. ఆ ముగ్గురు నేతలు వ్యతిరేకిస్తున్నారు. స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వకుంటే సహకరించేది లేదని తెగేసి చెబుతున్నారు.

ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ

స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తల ప్రమేయం లేకుండా నాన్‌లోకల్ అభ్యర్థిని పరిగణనలోకి తీసుకుంటే ఎన్నికల్లో ఏమి చేయగరలని కడప తెలుగు తమ్ముళ్లు వాదిస్తున్నారు. అదే విషయాన్ని అధినేత చంద్రబాబుకే తేల్చి చెప్పామని టీడీపీ విజయం సాధించాలంటే లోకల్ వారిని పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇన్‌చార్జి మాధవీరెడ్డితో కలిసి పని చేసే పరిస్థితే లేదని తేల్చి చెబుతున్నారు. ఆ మేరకు ఆమెతో ప్రమేయం లేకుండా ప్రత్యేకంగా కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ చేపట్టారు. ఈ వ్యవహారం వినాయక ఉత్సవాల నుంచి కొనసాగుతోంది. టీడీపీ నేతలు లక్ష్మిరెడ్డి, దుర్గాప్రసాద్, అమీర్‌బాబు ముగ్గురు కలిసికట్టుగా వినాయక మండపాలను సందర్శిస్తూ పూజలు చేపట్టారు. మాధవీరెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు సైతం దూరంగా ఉండిపోయారు. తాజాగా ఆదివారం ఆ ముగ్గురు నేతలతో పాటు మరి కొందరు డివిజన్ల ఇన్‌చార్జిలతో కలిసి దేవునికడపలో 101 టెంకాయలు కొట్టారు. సోమవారం నుంచి పాతబస్టాండ్ సమీపంలో నిరసన టెంట్ ఏర్పాటు చేసి, వేరుగా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. లోకల్ నాయకుల్ని అందర్నీ కలుపుకొని కార్యక్రమాలకు వెళ్లాలనే దిశగా ఆ ముగ్గురు అడుగులు వేస్తున్నారు.

అందరికీ ఆరోగ్యం.. జగనన్న లక్ష్యం

- అనారోగ్యంతో ఎవరూ బాధపడకూడదన్నదే 'ఆరోగ్య సురక్ష' లక్ష్యం
- 150 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయిస్తాం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి: అందరికీ సురక్షితమైన ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ కన్వీనర్లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రిపై ఓర్వలేని ప్రతిపక్ష పార్టీ నాయకులు భవిష్యత్తు లేదన్న అక్కసుతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వారి పాలనలో ప్రజలకు చేసిన మేలు లేకపోవడంతోనే వారు చెప్పుకోలేని దీనస్థితిలో ఉన్నారంటూ ఎద్దేవా చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ

ప్రతి ఇంటా సంపూర్ణంగా వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 21 వేల మంది వైద్య సిబ్బంది ద్వారా 10 వేల ప్రాంతాలలో 15 వేల వైద్య శిబిరాలను నిర్వహిస్తుండటం గొప్ప విషయమని ఎమ్మెల్యే అన్నారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఆశావర్కర్లు ప్రతి ఇంటికీ వెళ్లి స్క్రీనింగ్ టెస్ట్‌లను చక్కగా నిర్వహించారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను ఐదు విడతలుగా నిర్వహిస్తున్నారన్నారు. 7 రకాల వైద్య పరీక్షలు అందిస్తున్నారన్నారు. చికిత్సలు, శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ, నెట్‌వర్క్ ఆసుపత్రులకు సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. అక్కడ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం అందిస్తారన్నారు. సదరు రోగులను ఫాలో అప్ కూడా చేయడం జరుగుతుందన్నారు. పార్టీ యంత్రాంగంలో ఉన్నటువంటి వాళ్లు కూడా దీన్ని ప్రజలకు ఇంకా దగ్గరగా చేర్చి విజయవంతం చేసేందుకు సైనికుల్లా పని చేయాలని సూచించారు. డాక్టర్లు కూడా ఈ కార్యక్రమం చాలా బాగుందంటూ ముందుకు వచ్చి సేవలు అందిస్తుండటం హర్షదాయకమన్నారు. నిన్నటి శనివారం జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ఒక ప్రయివేట్ వైద్యుడు ఈ నెల రోజులు పాటు తాను పూర్తిగా ప్రయివేట్ ప్రాక్టీసును పక్కన పెట్టి ఈ జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొంటానని చెప్పడం ఈ కార్యక్రమం విలువ అర్థమవుతోందన్నారు. ఒక వైద్యుడి బిడ్డగా, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజల ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తున్నారన్నారు. ఒక చిన్నారి ఆరోగ్యానికి రూ.16 కోట్లు వ్యయం చేసి విదేశాల నుంచి ఇంజెక్షన్ తెప్పించి వేయించి ప్రాణాలను కాపాడిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అలగే ఒకరి ప్రాణాలు కాపాడేందుకు అవయవాలను త్వరితగతిన తీసుకురావడానికి తన హెలికాప్టర్‌నే పంపించిన దయార్ధ్ర హృదయుడు సీఎం జగన్ అని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ఇంటింటికీ తిరుగుతున్నపుడు గుండె జబ్బులకు వైద్యం చేయించుకుని ఆరోగ్యశ్రీతో పునర్జన్మ పొందామని కొందరు చెబుతుంటే.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత చదువులు చదువుతున్నామని మరికొందరు చెప్పుతుండటం చూస్తే మనసుకు ఇంతకన్నా ఆనందం ఏముంటుందన్నారు.

మంచి జరిగి ఉంటే మద్దతు ఇవ్వాలి

పాలనలో ప్రజలకు మంచి జరిగి ఉంటేనే తనకు ఓటు వేయాలని దమ్మున్న నేతగా, ధైర్యంగా కోరిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోతారన్నారు. చంద్రబాబునాయుడు ఎంతసేపూ 'అన్నీ నేను సృష్టించాను.. నా వల్లే గాలి వస్తోంది.. నా వల్లే ప్రపంచం నడుస్తుంది' అని చెప్పుకుంటాడే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్మన్లు వండాడి వెంకటేశ్వర్లు, విశ్వనాథరెడ్డి, ఎంపీపీలు సుద్దన్‌రెడ్డి, జెడ్పీటీసీలు కవిత, వెంకటరమణ, వెంకటేశ్వరరెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, గొర్ల రమేష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు గడికోట జనార్ధన్‌రెడ్డి, పోలు సుబ్బారెడ్డి, రియాజుర్‌రెహమాన్, మిట్టపల్లె యదుభూషణరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, గాలివీడు ఎస్‌కె ఖాదర్‌మొహిద్దీన్, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, సచివాలయ మెంబర్లు చుక్క అంజనప్ప, నల్లాబత్తుని వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే వంద పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తాం

రూ.23 కోట్లతో నిర్మాణాలను పూర్తి చేసుకున్న వంద పడకల ఆసుపత్రిని త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ ఆసుపత్రిని వంద పడకల నుంచి 150 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి సీఎం జగన్ సుముఖత వ్యక్తం చేశారన్నారు. ప్రతి మండలంలో రెండు పీహెచ్‌సీలు, ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను ప్రభుత్వం ఏర్పాటు చేసి ఎంఎల్‌హెచ్‌పీలను నియమించడం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో 50 వేల మంది ఉద్యోగాలను నియమించిన ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. గుండె ఆపరేషన్లు, డయాలసిస్ రోగులకు కూడా మందులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

రాజంపేటలో రచ్చకెక్కిన విభేదాలు

- గంటా వేయించిన బ్రోచర్లను బాయ్‌కాట్
- నిరహార దీక్ష శిబిరంలో ఆవిష్కరణకు తిరస్కరణ



గంటా వేసిన బ్రోచర్

రాజంపేట : టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న గంటా నరహరి 'బాబుతో నేను' బ్రోచర్స్ పంపిణీ వ్యవహారం రచ్చకెక్కింది. ఆదివారం టీడీపీ నేత డీఆర్‌ఎల్ మణి లాడ్జికి సమీపంలోని స్థలంలో జరుగుతున్న రిలే నిరాహారదీక్ష శిబిరంలో.. 'బాబుతో నేను బ్రోచర్స్'ను ఆవిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడును గంటా వర్గీయులు కోరడం, ఆయన తిరస్కరించడంతో తమ్ముళ్లలో చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఆదేశాల మేరకు గంటా నరహరి బ్రోచర్స్‌ను వేయించినట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. కాగా గంటా ఎంపీ అభ్యర్థి కాకుండా అవకాశాన్ని బట్టి ఎమ్మెల్యే అభ్యర్థిగా కూడా బరిలోకి దిగేందుకు మరోవైపు తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుగు తమ్ముళ్లు గుసగుసలాడుతున్నారు. పర్యవసానంగానే బ్రోచర్ల పంపిణీని అడ్డుకోవడానికి కారణమైందని తమ్ముళ్లు అంటున్నారు. టీడీపీలో వర్గ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి.

దీక్షలకు స్పందన కరువు

రాజంపేటలో చేపట్టిన నిరాహార దీక్షలకు స్పందన కరువైంది. బాబు అరెస్టును ప్రజలెవరూ పట్టించుకోవడం లేదు. కేవలం మీడియా గ్రూపులు, ఎల్లో మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు.

గంటా బ్రోచర్లు వద్దు

చంద్రబాబునాయుడుకు జైలు నుంచి విముక్తి కల్పించాలని టీడీపీ చేస్తున్న ఆందోళన నేపథ్యంలో.. 'బాబుతో నేను' అనే పోస్టర్లలో తన ఫొటోను ప్రముఖంగా ముద్రించి బ్రోచర్‌ను పార్టీ క్యాడర్‌కు పంపారు. ఈ బ్రోచర్‌లో జిల్లా అధ్యక్షుడు వాసుతోపాటు టీడీపీ ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడు ఫొటో కూడా వేశారు. అయినా ఈ బ్రోచర్లను ముందుగానే పార్టీ క్యాడర్‌కు చేరుకుండా అడ్డుకునే దిశగా చర్యలు తీసుకోవడం తమ్ముళ్లలో హాట్‌టాపిక్‌గా మారింది. గంటా బ్రోచర్స్‌ను తమ్ముళ్లే తిప్పి పంపారు. దీంతో గంటా వర్గీయులు తీవ్రంగా మండిపడుతున్నారు.

క్లుప్తంగా

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ దిగువబొమ్మపల్లెకు చెందిన ఎస్.వెంకటరమణ కుమారుడు ఎస్.మల్లికార్జున(35) భవననిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో శనివారం రాత్రి ఇంటివద్ద పురుగులమందు తాగాడు. అదేవిధంగా నిమ్మనపల్లె మండలం ముష్టూరుకు చెందిన ఖాదర్‌బాషా భార్య ఎస్.ప్యారేజాన్(23) కుటుంబ సమస్యలతో శనివారం రాత్రి నిద్ర మాత్రలు మింగింది. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్ట్ పోలీసులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లకు సమాచారం అందించగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి మహిళకు గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం అదుపుతప్పి మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రామసముద్రం మండలంలోని కర్నాటక సరిహద్దులో జరిగింది. చౌడేపల్లె మండలం కాగతి పంచాయతీ మర్రిమాకులపల్లెకు చెందిన సుధాకర్ భార్య వెంకటరత్నమ్మ(40) మేనల్లుడు కల్యాణ్‌కుమార్‌తో కలిసి ద్విచక్రవాహనంలో కర్నాటక రాష్ట్రం శంకరాపురంలో ఉన్న ఆలయానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా సరిహద్దు ప్రాంతంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో వెంకటరత్నమ్మ తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి


ఆటోలోనే కుప్పకూలిన గోపాల్

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నెహ్రూనగర్‌కు చెందిన గోపాల్ (55) అనే ఆటోడ్రైవర్ ఆదివారం సాయంత్రం తాను నడుపుతున్న ఆటోలోనే రక్తం కక్కుకుని మృతి చెందాడు. అనారోగ్యంతో మృతి చెందాడా? లేక మరే కారణమా అనేది తెలియాల్సి ఉంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

గూడ్స్ రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి..


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం రైల్వే ఎస్‌ఐ రారాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి సుమారు 35 ఏళ్లు ఉంటాయని ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

మహాత్ముని మాట.. స్ఫూర్తి బావుటా

- మదనపల్లె పర్యటనలో మధుర జ్ఞాపకాలు
- నేడు గాంధీజీ 154వ జయంతి



మదనపల్లె సిటీ : మహాత్ముడు కాలంతో ప్రయాణించే మహనీయుడు. తరాలు మారినా ఇప్పటికీ ఆయన నడిచిన మార్గాన్ని ప్రపంచం అనుసరిస్తోంది. ఆయన జీవితం పవిత్రతకు ప్రతిరూపం. జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతి వేడుకలను అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. స్వాతంత్ర్యం కోసం మదనపల్లె కేంద్రంగా అనేక ఉద్యమాలు జరిగాయి. హోంరూల్ ఉద్యమం, విదేశీ వస్త్ర బహిష్కరణ, క్విట్ ఇండియా లాంటి ఉద్యమాలు తారా స్థాయికి చేరుకున్న వేళ.. మహాత్మాగాంధీ మదనపల్లెలో అడుగుపెట్టారు. విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమ ప్రచారంలో పాల్గొన్నారు. 1929 మే నెలలో ఆయన మదనపల్లెలో పర్యటించి స్థానిక బీటీ కాలేజీ మైదానంలో సభ నిర్వహించారు. గాంధీజీని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చారని అప్పటివారు చెబుతారు. ఆయనను చూడటం, చెప్పింది శ్రద్ధగా వినడం, మనసావాచాకర్మణా ఆచరించడం చేశారు. విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని, అంటరానితనాన్ని నిర్మూలించాలని గాంధీజీ పిలుపునిచ్చారు. ఖద్దరు నిధికి విరాళాలు సేకరించారు. ఆ రోజుల్లో ఆయన పిలుపునకు స్పందించి మదనపల్లె వాసులు రూ.2,475 విరాళంగా అందజేశారు. గాంధీజీ రగిలించిన స్ఫూర్తితో స్వాతంత్ర్య సంగ్రామంలో మదనపల్లె వాసులు కీలకపాత్ర పోషించారు. అనంతరం గాంధీజీ అనంతపురం జిల్లా పర్యటనకు వెళ్లారు. మహాత్మాగాంధీ బీటీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొనడానికి ముందు నిమ్మనపల్లె సర్కిల్ నుంచి సభా ప్రాంగణం వరకు నడుచుకుంటూ వెళ్లారు. దీంతో ప్రస్తుతం నిమ్మనపల్లె సర్కిల్ నుంచి చిత్తూరు బస్టాండు కూడలి వరకు ఉన్న రోడ్డును గాంధీ రోడ్డుగా పేరు పెట్టారని చరిత్ర చెబుతోంది.


గాంధీజీ సభ నిర్వహించిన బీటీ కాలేజీ

పాదస్పర్శతో పులకించిన నేల

కడప కల్చరల్ : సహాయ నిరాకరణ ఉద్యమ సారధిగా బాపూజీ 1921 సెప్టెంబరు 28న వైఎస్‌ఆర్ జిల్లాలో తొలిసారిగా పర్యటించారు. రాజంపేట అనంతరం కడప నగరానికి చేరుకుని మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగించారు. రెండవసారి 1929 మే 17న కస్తూర్బాతో కలిసి కడప నగరానికి వచ్చారు. కొండాపురం, మంగపట్నం, చిలంకూరు, నిడిజువ్వి, ఎర్రగుంట్ల ద్వారా రాత్రి 11 గంటలకు ప్రొద్దుటూరుకు చేరారు. 18న సతీమణితో కలిసి వసంతపేటలో ప్రజలతో మాట్లాడి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి నింపారు. జిల్లా ప్రముఖులు కోటిరెడ్డితో కలిసి చాగలమర్రికి వెళ్లారు. 1933 డిసెంబరు 31న రాత్రి 7.30 గంటలకు మూడవసారి గాంధీజీ కడపలో పర్యటించారు. జిల్లా ప్రముఖులు దేవిరెడ్డి రామసుబ్బారెడ్డి ఇంటిలో విడిది చేశారు. హరిజనోద్ధరణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. 1934 జనవరి 2న మరోసారి ఆయన జిల్లాకు వచ్చారు. రెండు స్వదేశీ ఎంపోరియంలను ప్రారంభించారు. దళితవాడ (మాసాపేట)ను సందర్శించి అక్కడి స్థితిగతులను గురించి స్థానిక యువతతో మాట్లాడారు. తర్వాత మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఉపన్యసించారు.

జిల్లా ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్ మృతి


మృతి చెందిన స్టాఫ్‌నర్స్ జీఎం అరుణకుమారి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్‌నర్స్ జీఎం అరుణకుమారి (54) మృతి చెందారు. నైట్ షిఫ్ట్‌లో భాగంగా శనివారం ఆమె విధులు నిర్వహిస్తూ ఆదివారం ఉదయం కళ్లు తిరిగి కింద పడిపోయారు. నర్సింగ్ సిబ్బంది హుటాహుటిన ఆమెను అత్యవసర విభాగానికి తరలించారు. గుండెపోటు వచ్చిందేమోననే అనుమానంతో వెంటనే పట్టణంలోని గుండె వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమెకు భర్త వెంకటరమణతో పాటు వెంకటమన్యు అనే బీటెక్ చదువుతున్న కుమార్తె ఉన్నారు. 2019 నుంచి ఆమె ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల నుంచి ఆమెకు జ్వరం వస్తోందని, బీపీ కూడా ఉన్నట్లు భర్త తెలిపారు. డీసీహెచ్‌ఎస్ హిమబిందు ఆస్పత్రికి చేరుకొని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుతో మాట్లాడి జరిగిన సంఘటన గురించి తెలుసుకున్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

కాంతారా సినిమా పాటకు నృత్యం కోసం నిప్పు రాజేస్తుండగా ఎగిసిపడిన మంటలు, ఐదుగురికి తీవ్ర గాయాలు


కాంతారా సినిమా పాటకు నృత్యం కోసం చుట్టూ మంటలు వేసిన దృశ్యం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని నడివూరులో కొలువుదీరిన వినాయక నిమజ్జనం సందర్భంగా అపశ్రుతి చోటు చేసుకుంది. శనివారం రాత్రి జరిగిన ఊరేగింపులో కొందరు యువకులు కాంతారా సినిమాలోని పాటకు డ్యాన్స్ చేస్తున్నారు. ఇదే సందర్భంలో ఓ వలయం గీసి దాని చుట్టూ పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఊరేగింపు చూడడానికి వచ్చిన జనాల్లోకి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో చైతన్య, ధనుష్, చందు, హేమశ్రీ, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎర్రగుంట్ల పట్టణ సీఐ ఈశ్వరయ్య మాట్లాడుతూ వినాయక నిమజ్జన ఊరేగింపులో చోటుచేసుకున్న సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు 20 మందిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు చెప్పారు.

నలుగురు సస్పెన్షన్, సీఐ, ఎస్‌ఐలకు చార్జ్‌మెమోలు

కడప అర్బన్ : ఎర్రగుంట్ల నగర పంచాయతీలో శనివారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనం ఊరేగింపులో అపశ్రుతి సంఘటనను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సీరియస్‌గా తీసుకున్నారు. ప్రాథమిక విచారణ మేరకు బందోబస్తు విధుల్లో పాల్గొన్న ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య, ఎస్‌ఐలు పి. ప్రవీణ్‌కుమార్, హెచ్. కృష్ణంరాజు నాయక్‌లకు చార్జ్ మెమో ఇచ్చారు.

ఎలుగుబంటి దాడిలో యువకుడికి గాయాలు


ఎలుగుబంటి దాడిలో గాయపడిన కాశీరావు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని రేకలకుంట పంచాయతీ ఆర్.గొల్లపల్లెకు చెందిన కాశీరావు ఆదివారం తెల్లవారుజామున రేకలకుంటకు వస్తుండగా ఎలుగుబంటి దాడి చేసింది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. తల్లిదండ్రుల కథనం మేరకు కాశీరావు రేకలకుంటకు వెళ్లి వస్తుండగా కంపచెట్లలో దాగిన ఎలుగు బంటి ఎదురుగా వచ్చింది. భయపడిన కాశీరావు పరుగుతీయగా వెంబడించి వంటిపై గోర్లతో బరికింది. బాధితుడిని వైద్యంకోసం కడప రిమ్స్‌కు తరలించారు.

హత్యాయత్నం ఘటనలో నలుగురి అరెస్టు

కొండాపురం : మండల పరిధిలోని తాళ్లప్రొద్దుటూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. హరినారాయణరెడ్డి పై హత్యాయత్నానికి పాల్పడిన వారిని అరెస్టు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. తాళ్ల ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన హరినారాయణరెడ్డిపై ఇటీవల జరిగిన హత్యాయత్నం జరిగిందన్నారు. ఈ సంఘటనకు సంబంధించి అదే గ్రామానికి చెందిన వెంకట పుల్లయ్య, అనంతపురం జిల్లా కణేకల్లుకు చెందిన అద్నాన్ రజాక్, రామాంజినేయులు (పార్థు), పెద్దపప్పూరు మండలానికి చెందిన చంద్రశేఖర్‌లను అరెస్టు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

సాగర్ ఎడమ కాలువలో జారిపడిన వృద్ధురాలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని నరసన్నపల్లె ఎస్సీ కాలనీకి చెందిన జ్ఞానమ్మ అనే వృద్ధురాలు ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ పనికి వెళ్లి తిరిగి వస్తూ సమీపంలోని సాగర్ ఎడమ కాలువలో కాలు జారి పడి పోయింది. ఆమె నీళ్లలో లింగాలదిన్నెపల్లె దగ్గరలోని పోరుమామిళ్ల– మైదుకూరు రహదారి బ్రిడ్జి దగ్గరకు రాగా పశువుల కాపరులు, స్థానికులు గుర్తించారు. ఇంతలో బి.మఠం పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్తుల సాయంతో ఒడ్డుకు చేర్చారు. పోలీసులు వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ఆదర్శవంతంగా ఉండాలి

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ఆదర్శవంతంగా ఉండాలని డిప్యూటీ సీఎం అంజద్ బాషా పేర్కొన్నారు. ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) జిల్లాశాఖ తరపున ఆదివారం కడప బెల్లంమండి వీధిలోని మదరసా జెవారాలోని కాన్ఫరెన్స్ హాలులో 13 మంది ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డులను ఆశించకుండా ఆదర్శవంతంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఐటాయే ఎంపిక చేసి సన్మానించడం అభినందనీయమన్నారు. అవార్డులు తీసుకున్న ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా పనిచేసి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఐటా జాతీయ ప్రధాన కార్యదర్శి మీర్ ముంతాజ్ అలీ మాట్లాడుతూ ఈ సంఘం కేవలం ఉపాధ్యాయుల హక్కుల కోసమే కాకుండా ఆదర్శ సమాజ నిర్మాణం కోసం పనిచేస్తుందన్నారు. ఐటా జాతీయ కార్యదర్శి షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ఐటా ఉపాధ్యాయులకు సమకాలీన అంశాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం నగరంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ప్రవక్త మహమ్మద్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ చాటిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటా జిల్లా అధ్యక్షుడు నజీర్‌బాషా, జిల్లా గౌరవాధ్యక్షులు మౌలానా గౌస్ అహ్మద్, నిజామ్, జిల్లా కార్యదర్శి అబ్బాస్‌అలీ, రాష్ట్ర ట్రెజరర్ ఫయాజుల్ రెహమాన్, జెఐహెచ్ అధ్యక్షుడు ఖాదర్‌వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వయో వృద్ధుల యోగక్షేమాలను తెలుసుకోవాలి

జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్

కడప అర్బన్ : వయో వృద్ధుల యోగక్షేమాల విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కడప నగరంలోని ఆజాద్ నగర్‌లో ఉన్న బృంద వృద్ధాశ్రమాన్ని సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం రిమ్స్ ఆవరణలో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన్‌స్టాప్ సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం, మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉంటాయన్నారు. అలాగే కడప నగరంలోని మరియాపురం సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం–2 ను కూడా జడ్జి ప్రదీప్‌కుమార్ తమ సిబ్బందితో సందర్శించారు. విద్యార్థినులు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలన్నారు.

నువ్వులేక నేనుండలేను,!

- భర్త మరణం జీర్ణించుకోలేక ఆత్మహత్య
- అనాథలైన చిన్నారులు


మృతి చెందిన అమరేశ్వరి

ముద్దనూరు : ఐదు నెలల క్రితం ఆమె భర్త విద్యుదాఘాతంతో మరణించాడు. అప్పటి నుంచి ఆమె భర్త గురించే ఆలోచిస్తూ.. బాధపడుతూ కాలం నెట్టుకొచ్చింది. చివరకు తన తోడు నీడ లాంటి భర్తే లేనప్పుడు ఇక తాను జీవించడం ఎందుకని భావించింది. ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సీఐ నరేష్ బాబు సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజులగురువాయిపల్లెకు చెందిన రాజుల అమరేశ్వరి(24) సచివాలయ వలంటీర్‌గా విధులు నిర్వర్తించేది. ఆమె భర్త శివానందరెడ్డి ఇటీవల విద్యుదాఘాతానికి గురయ్యాడు. సుమారు 3 నెలల పాటు చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. చివరకు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మరణించాడు. అప్పటినుంచి అమరేశ్వరి భర్త మరణాన్ని జీర్ణించుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలో ఆమె ఆదివారం ఉదయం గ్రామంలో పింఛన్లు పంపిణీ చేసింది. అనంతరం ఇంటికి వచ్చి ఇద్దరు పిల్లలను ఆడుకోవడానికి బయటకు పంపించి ఉరి వేసుకుంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అమ్మానాన్నల మృతితో ఆ చిన్నారులు అనాథలుగా మిగిలారు. ఈ విషాద సంఘటన గ్రామంలో అందరినీ కలచివేసింది. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ కొత్త అపార్ట్‌మెంట్ బ్రోచర్ విడుదల


సీపీఆర్ కాస్మోస్ హై రైజ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి కల్చరల్ : రేణిగుంట రోడ్డు, అంకుర ఆస్పత్రి సమీపంలో సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన సీపీఆర్ కాస్మోస్ హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ బ్రోచర్‌ను ఆదివారం సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ చలపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు నూతనమైన సదుపాయాలతో 2బీహెచ్‌కే, 3బీహెచ్‌కే, 1230 స్క్వేర్ ఫీట్స్ నుంచి 2085 స్క్వేర్ ఫీట్స్ వరకు అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. విశాలవంతమైన అమినిటీస్ బ్లాక్ 15,000 స్క్వేర్ ఫీట్స్, క్రికెట్ పిచ్, బ్యాడ్మింటన్ కోర్ట్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, వాకింగ్ ట్రాక్, జాగింగ్ ట్రాక్ వంటి ఎన్నో సదుపాయలు తమ కొత్త అపార్ట్‌మెంట్ వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ డైరెక్టర్స్ హర్షితరెడ్డి, లోకేష్‌రెడ్డి, వినీషారెడ్డి, కాశీ విశ్వనాథ్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ సోమేశ్వర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న ఇల్లూరు గ్రామస్తులు


ఇల్లూరు గ్రామంలో ఇసుక రవాణాను అడ్డుకుంటున్న గ్రామస్తులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ఇల్లూరు గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తుండగా ఆ గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గతంలో ఇసుక రీచ్ ఉండటం వల్ల అనుకున్న దానికంటే ఇసుకను అధికంగా తరలించారు. ఇప్పుడు మళ్లీ ఇసుకను తరలిస్తే నదిలో ఉన్న వ్యవసాయ బోర్లు, గ్రామానికి నీటి సరఫరా అందించే స్కీంలకు నీరు లేకుండా ఇంకిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఇసుక రవాణాను అడ్డుకున్నట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు కలమల్ల ఎస్‌ఐ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

యోగివేమారెడ్డి అన్నదాన సత్రం సమావేశంలో ఉద్రిక్తత


పోలీసులు స్వాధీనం చేసుకున్న పెట్రోల్, డీజిల్ క్యాన్లు


పోలీసులు తీసుకెళుతున్న కత్తులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని యోగి వేమారెడ్డి రెడ్ల నిత్య అన్నదాన సత్రంలో ఆదివారం ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అన్నసత్రానికి ప్రస్తుతం 8 నెలలుగా అధ్యక్షురాలిగా ఉంటున్న అంకిరెడ్డిపల్లె సిద్దేశ్వరి సత్రానికి సహకరించిన దాతలు, భక్తుల పట్ల సరిగా ప్రవర్తించడం లేదనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో సిద్దేశ్వరిని సత్రం పాలనా వ్యవహారాలనుంచి తప్పించాలని సత్రానికి విరాళాలు ఇచ్చిన దాతలు, గదుల నిర్మాణ దాతలు ఆదివారం బ్రహ్మంగారిమఠంలోని రెడ్ల అన్నదాన సత్రంలో సమావేశం నిర్వహించేందుకు ఎంపీపీ సి.వీరనారాయణ రెడ్డి, ఎ.చిన్న ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అక్కడే ఉన్న సిద్దేశ్వరిని గేటు తాళాలు తీయాలని కొంతమంది కమిటీ సభ్యులు కోరారు. ఈ సమయంలో సిద్దేశ్వరి వెంట ఉన్న కొంతమంది దురుసుగా మాట్లాడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలోనే కమిటీ సభ్యులు తాళం పగులకొట్టి లోనికి చేరుకున్నారు. సత్రంలో ఒక గదిలో అప్పటికే సిద్ధంగా ఉన్న 5 లీటర్ల పెట్రోల్ క్యాన్‌తో ఒక్కసారిగా లోనికి వచ్చిన వారిపై పెట్రోల్ చల్లడంతో అక్కడ ఉన్నవారు భయంతో పరుగులు తీశారు. ఇంతలో బి.మఠం ఎస్‌ఐ విద్యాసాగర్, బద్వేల్ అర్బన్ సీఐ యుగంధర్, మహిళా ఎస్‌ఐ, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఘర్షణను నివారించి సమావేశాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అలాగే సత్రంలోని గదులను పోలీసులు పరిశీలించగా ఒక గదిలో ఉన్న డీజిల్ క్యాన్, మూడు కత్తులు, కారంపొడిని స్వాధీనం చేసుకోని సిద్దేశ్వరిని బయటకు తీసుకుని వెళ్లారు. కాగా తనపై రెడ్డి సోదరులు దాడి చేశారని సిద్దేశ్వరి విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఆమెకు పోటీగా కమిటీ సభ్యులు కూడా ముందుగా ఆమెనే తమపై దాడి చేశారని ఆరోపించారు. పోలీసులు మాత్రం విచారించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన అధ్యక్షుడిగా గంగిరెడ్డి



బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం, మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో గత 32 ఏళ్లుగా కొనసాగుతున్న యోగి వేమారెడ్డి రెడ్ల నిత్య అన్నదాన సత్రం నూతన అధ్యక్షుడిగా పెండ్లిమర్రి మండలానికి చెందిన గంగిరెడ్డిని కమిటీ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బి.మఠం ఎంపీపీ చిలేకాంపల్లె వీరనారాయణ రెడ్డి మాట్లాడుతూ యోగి వేమారెడ్డి రెడ్ల అన్నదాన సత్రం దినదినాభివృద్ధి చెందడానికి రాయలసీమలోని రెడ్ల సహకారం ఎంతగానో ఉందన్నారు. నూతన కమిటీ ఎన్నికకు జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి సహకారం ఉందన్నారు. నూతన కమిటీ సభ్యులు సత్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు చౌదరివారిపల్లెకు చెందిన అంకిరెడ్డిపల్లె చిన్నఓబుల్‌రెడ్డి, కోటిరెడ్డి, పాలరామిరెడ్డి, సర్పంచ్ చిన్న ఓబుల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ భూమిరెడ్డి కృష్ణారెడ్డి, వివిధ జిల్లాలు, స్థానిక మండలాల నుంచి పలువురు రెడ్లు పాల్గొన్నారు.

బస్సు, బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కాశినాయన : మండలంలోని అమగంపల్లె టీబీ ఆసుపత్రి వద్ద ఆదివారం బస్సు, మోటారు బైక్ ఢీకొని ఆకులనారాయణపల్లె గ్రామానికి చెందిన పూల సుబ్బరాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుబ్బరాయుడు ద్విచక్ర వాహనంలో మైదుకూరుకు వెళుతున్నాడు. మైదుకూరు నుంచి గిద్దలూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో సుబ్బరాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఎస్‌ఐ హరిప్రసాద్ కేసు నమోదు చేశారు.

హైవే పెట్రోలింగ్ వాహనం ఢీకొని..

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం(డీటీసీ)లోకి వెళుతున్న హైవే పెట్రోలింగ్ వాహనాన్ని, సిద్దవటం వైపు నుంచి వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సిద్దవటం మండలం పెద్దపల్లి పంచాయతీ మిట్టపల్లి గ్రామానికి చెందిన కాడే వెంకటరమణ తన ద్విచక్రవాహనానికి ముందు లారీలు వెళుతుండగా. సరిగ్గా డీటీసీ వద్ద కడప వైపు నుంచి వస్తున్న హైవే పెట్రోలింగ్ వాహనం లోపలికి తిప్పడంతో, లారీని ఓవర్‌టేక్ చేసి వచ్చిన ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొన్నాడు. గాయపడిన వ్యక్తిని రిమ్స్‌కు తరలించారు.